• 'డబుల్ ఇండ్ల'కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

• పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిసి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ–1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ

ఆది రాజవ్వ

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరితి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి

ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళల జట్టు క్రీడాకారులు

కొత్తపల్లి, జనవరి 31 : తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలను ఇకనుంచి ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తామని ఐజీ స్పోర్ట్స్ తెలంగాణ రమేశ్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో జరుగుతున్న 3వ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో భాగంగా శుక్రవారం ఆయన పోలీస్ పరేడ్, అంబేద్కర్ స్టేడియం, సీటీసీ మైదానాల్లో ఏర్పాటు చేసిన ఖోఖో, హాకీ, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయస్థాయి పోలీస్ క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర జట్లు విశేష ప్రతిభ చాటి విజయకేతనం ఎగురవేయాలన్నారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ సీపీ, కమిషనరేట్ అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఖోఖో క్రీడలో ప్రతిభ చాటుతున్న సిరిసిల్ల జోన్‌కు చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేశ్‌ను ఐజీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డీఎస్పీ రామారావు, ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ మధు, ఎస్సై నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్ విజేతలు: ఖోఖోలో టీజీఎస్పీ రేంజ్–1 విజేతగా గెలుపొందగా, రన్నరప్‌గా టీజీపీ రేంజ్–2 నిలిచింది. మూడో స్థానంలో రాజన్న సిరిసిల్ల జోన్–3కి చెందిన జట్టు క్రీడాకారులు నిలిచారు. కబడ్డీ మహిళల్లో విజేతగా రాచకొండ పోలీస్ జట్టు, రన్నరప్‌గా యాదాద్రి జోన్–5 జట్టు, ఫుట్‌బాల్లో టీజీఎస్పీ–1 విజేతగా నిలువగా, హైదరాబాద్ కమిషనరేట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాస్కెట్‌బాల్ పురుషుల విభాగంలో విజేతగా హైదరాబాద్ కమిషనరేట్ జట్టు, రన్నరప్‌గా కాళేశ్వరం జోన్ జట్టు నిలిచింది. హాకీలో హైదరాబాద్ కమిషనరేట్ గెలుపొందగా, వరంగల్ కమిషనరేట్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

బ్యాడ్మింటన్ లో రెండు పతకాలు

బంగారు పతకంతో షబానా సుల్తానా

రాంనగర్, జనవరి 31: తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో కరీంనగర్ పోలీసులు విశేష ప్రతిభ చూపుతున్నారు. శుక్రవారం జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో డబుల్స్ విభాగంలో కరీంనగర్ కమిషనరేట్ మినిస్టియల్ ఉద్యోగిని షబానా సుల్తానా బంగారు పతకం, సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించింది.

బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్

కార్పొరేషన్, జనవరి 31: కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చిన ఖాదర్ మొయినుద్దీన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధుల్లో ఉన్న డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి నిజామాబాద్ బదిలీ కాగా, కరీంనగర్ నుంచి రిలీవ్ కాకపోవడం మున్సిపాలిటీలో చర్చకు దారి తీసింది. ఆమె స్థానంలో వచ్చిన ఖాదర్ విధుల్లో చేరడం, ఈమె మాత్రం ఇంకా రిలీవ్ కాకపోవడంపై ఏమిటి అన్నది మున్సిపాలిటీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఆకట్టుకున్న 'ఎనిమిదో అడుగు' నాటిక

కమాన్‌చౌరస్తా, జనవరి 31 : జిల్లా కేంద్రంలోని కళాభారతిలో మన సమైక్యత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో 'ఎనిమిదో అడుగు' నాటికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాటికలోని పలు సన్నివేశాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యాదగిరి, రాజేంద్ర ప్రసాద్, దివాకర్ బాబు, డాక్టర్ శ్రీజ సాదినేని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నిరంతరం నేర్చుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- సప్తగిరి కాలనీ జడ్పీహెచ్ఎస్‌లో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ల్యాబ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కమాన్‌చౌరస్తా, జనవరి 31 : విద్యార్థులు నిరంతరం క్రమశిక్షణతో నేర్చుకుంటూ తమ కంటూ ఒక బ్రాండ్ సృష్టించుకునేలా ముందుకు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎనిమిది కంప్యూటర్లతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ అశోక్, హెచ్ఎం రాజేందర్, ఫౌండేషన్ సభ్యులు సూర్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి

విద్యానగర్, జనవరి 31 : ఈ నెల 10న నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని ఒకటి నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌తో కలిసి జిల్లా వైద్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించి సూచనలు చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిదా, డీడబ్ల్యూవో సబిత, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

శిశువు దత్తత

కలెక్టరేట్, జనవరి 31: నగరంలోని శిశుగృహలో పెరుగుతున్న నాలుగు నెలల చిన్నారిని పిల్లలు లేని దంపతులకు కలెక్టర్ దత్తత ఇచ్చారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత మాత్రమే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కె.సబిత, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, సీడబ్ల్యూసీ సభ్యుడు రెండ్ల కళింగశేఖర్, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సామాజిక కార్యకర్త రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాభివృద్ధికి సమగ్ర కృషి

కొత్తపల్లి, జనవరి 31 : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా అసోసియేషన్లను పటిష్టం చేస్తూ , యోగ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలంగాణ యోగ అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో జరిగిన తెలంగాణ యోగా అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, జాతీయస్థాయిలో తెలంగాణ క్రీడాకారులు విశేషంగా రాణించడం సంతోషదాయకమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు అన్ని జిల్లా అసోసియేషన్లు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. వచ్చే నెలలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు నిజామాబాద్‌లో నిర్వహించేందుకు అసోసియేషన్ తీర్మానించింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ ఎన్ రెడ్డి, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జాల మనోహర్, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, కోచ్‌లు వీ కిష్టయ్య, పీ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలును సందర్శించిన డీఐజీ

ఉద్యోగ విరమణ పొందిన సూపరింటెండెంట్ శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న డీఐజీ, తదితరులు

సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపడుతున్న విజయ్ డేనీ

రాంనగర్ జనవరి 31: జిల్లా జైల్లో ఖైదీల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను జైళ్ల శాఖ డీఐజీ సంపత్ ప్రత్యక్షంగా పరిశీలించారు. శుక్రవారం జిల్లా జైలును సందర్శించిన డీఐజీ ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. ముందుగా సూపరింటెండెంట్ శ్రీనివాస్ చేతుల మీదుగా వీడియో కాన్ఫరెన్స్ గదిని, జైలు ఆవరణలో ఏర్పాటుచేసిన బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఐజీ సంపత్‌తో పాటు జైలు సిబ్బంది ఉద్యోగ విరమణ పొందిన సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా బదిలీపై వచ్చిన విజయ్ డేనీ బాధ్యతలు స్వీకరించారు.

శ్రీ చైతన్యలో 'ఫ్రెషర్స్' హంగామా

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్, జనవరి 31: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు 'బేటా అర్రైవల్స్ 2కే25' పేరుతో నిర్వహించిన స్వాగతోత్సవ కార్యక్రమం అలరించింది. వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, కళాశాల వసతులను సద్వినియోగం చేసుకొని రాణించాలన్నారు. అలాగే, ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో రిక్రూట్ అయిన విద్యార్థులను అభినందించారు. వేడుకల్లో డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామనర్సింహారెడ్డి, హెచ్‌వోడీ అప్పారావు, రవీందర్‌రెడ్డి, రాంప్రసాద్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, జనవరి 31 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్‌గా ఏర్పడిన తర్వాత యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ న్యూఢిల్లీ నుంచి స్వయం ప్రతిపత్తి హోదా పొందిన పిమ్మట మొదటిసారి నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. మొత్తం 812 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 481 మంది ఉత్తీర్ణత సాధించారు. కళాశాల ఉత్తీర్ణత శాతం 59.24శాతంగా ఉందని, బీఏలో 47.74 శాతం, బీకాంలో 70.25 శాతం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 48.46 శాతం, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 60.94 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు వివరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జేవీ రాజిరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ జి. శ్రీనివాస్, సతీశ్, అకాడమిక్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎన్. మనోజ్ కుమార్, డాక్టర్ రజిని, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. పరీక్ష ఫలితాలు కళాశాల వెబ్‌సైట్ https://gdcwakarimnagar.com/UGRES/index2024.php లో చూడవచ్చని వివరించారు.

వీర్లను పరామర్శించిన వినోద్‌కుమార్

వీర్ల ప్రభాకర్‌రావును పరామర్శిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

రామడుగు, జనవరి 31 : రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు తండ్రి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వీర్ల ప్రభాకర్‌రావును శుక్రవారం జిల్లా కేంద్రంలోని వారి నివాసంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. వీర్ల ప్రభాకర్‌రావు ఇటీవల మోకాలు కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేసుకొని, ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ పరామర్శించి, ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు ఉన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగు పరుచాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, జనవరి 31: నగరంలో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేలా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నగరపాలక సంస్థలో శుక్రవారం శానిటేషన్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, డివిజన్ వారీగా ఉన్న ట్రేడ్ లైసెన్స్ ప్రకారం సంబంధిత షాపులను విజిట్ చేసి మేజర్‌మెంట్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. డివిజన్ వారీగా పారిశుధ్య పనుల్లో పిన్ పాయింట్ ప్రోగ్రాంను అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎస్సైలు శ్రీధర్, వెంకన్న, గట్టు శ్రీనివాస్, మహేందర్, నర్సోత్తమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల కార్మికులకు నగరపాలక సంస్థ అప్రాన్స్ పంపిణీ

కార్పొరేషన్, జనవరి 31 : కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇటీవల నూతనంగా విలీనమైన కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మల్కాపూర్, చింతకుంట, దుర్శేడ్, గోపాల్ పూర్, బొమ్మకల్ ప్రాంతాల్లో శుక్రవారం అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. అన్ని గ్రామాల్లో కార్మికులకు నగరపాలక సంస్థకు చెందిన అప్రాన్స్ పంపిణీ చేశారు. ప్రతి రోజు అప్రాన్స్‌ను వేసుకొని కార్మికులు పారిశుధ్య పనులు చేయాలని అసిస్టెంట్ కమిషనర్ ఆదేశించారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తున్న వీసీ

కమాన్‌చౌరస్తా, జనవరి 31: శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి భవిష్యత్తు ఉన్నదని, విద్యార్థులు సరికొత్త కంప్యూటర్ లాంగ్వేజెస్ నేర్చుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నమ్రత, అకాడమిక్ ఆడిట్ డైరెక్టర్ సరసిజ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ అర్జున్ గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు

హుజూరాబాద్ టౌన్, జనవరి 31: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు శుక్రవారంతో ముగుస్తుండగా ఉత్తమ డ్రైవర్లకు హుజూరాబాద్ ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ టౌన్ సీఐ జీ తిరుమల్ గౌడ్ అవార్డులు అందించి, ఘనంగా సన్మానించారు. అవార్డులు అందుకున్న వారిలో ఆగయ్య, శ్రీనివాస్, ఈఆర్ రావు, పీఎస్ రావు ఉన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది పాల్గొన్నారు.